క్లుప్తంగా

విద్యార్థులకు చలికోట్లు పంపిణీ



విద్యార్థులకు చలికోట్లు పంపిణీ చేస్తున్న సంస్థ వ్యవస్థాపకులు

కలసపాడు : మండలంలోని పెండ్లిమర్రి వద్ద ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో చదువుతున్న 237 మంది విద్యార్థులకు పోరుమామిళ్లలోని చిత్తాశౌరిరెడ్డి మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, చిత్తాతోమాస్‌రెడ్డిలు చలికోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్‌లో ఉండి చదువుతూ చలికాలంలో ఇబ్బంది పడుతున్నారనే ఉద్దేశ్యంతో చలికోట్లు పంపిణీ చేశామన్నారు. సంస్థ వ్యవస్థాపకులకు పాఠశాల ప్రిన్సిపల్ రెడ్డిజ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు కతజ్ఞతలు తెలిపారు.

ఘన సత్కారం

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు కోర్టులో సీనియర్ సివిల్ జడ్జిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన షేక్ ఫయజున్నీసాకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సన్మానం చేశారు. బార్ అసోసియేషన్ న్యాయవాదులు బుధవారం జడ్జికి తేనీటి విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రెండవ అదనపు జిల్లా జడ్జి సత్యకుమారి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి హారిక, 1వ మెజిస్ట్రేట్ సురేంద్రారెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి ఖాసిం గుర్రప్ప, సీనియర్ న్యాయవాదులు వెంకటరత్నం, దాదాపీర్, దాదాహయాత్, రాంప్రసాద్‌రెడ్డి, బందెల ఓబులేసు, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

22న జాబ్ మేళా

ప్రొద్దుటూరు : స్థానిక హౌసింగ్ బోర్డులోని వెలుగు కార్యాలయంలో ఈనెల 22న ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఉపాధి కల్పన, వ్యవస్థాపక అభివృద్ధి సంస్థ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఎస్‌బీఐ కార్డ్స్‌లో రిలేషన్ షిప్ ఎగ్జిక్యూటివ్, బ్లిస్టార్ మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్‌లో జూనియర్ రిలేషన్ షిప్ ఎగ్జిక్యూటివ్ అండ్ ఐటీఏ, ఎల్ఐసీ ఆఫ్ ఇండియాలో బీమా శక్తి పార్ట్ టైం, ఫుల్ టైం ఉద్యోగాలు ఖాళీ ఉన్నట్లు తెలి పారు. 10వ తరగతి నుంచి డిగ్రీ నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తమ బయోడేటాతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకురావాలని సూచించారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పరీక్ష సామగ్రిని అందిస్తున్న డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ భావన తెలిపారు. స్థానిక వసంతపేటలోని మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం విశ్రాంత ఉపాధ్యాయుడు చిత్రాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు రానున్న పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించి బంగారు భవిష్యత్తుకు బాట వేసుకోవాలని ఆకాంక్షించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పరీక్ష సమాగ్రిని 99 మందికి అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధిలో పని దినాలు పెంచాలి

బ్రహ్మంగారిమఠం : గత ఏడాదిలో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పనులకు ప్రభుత్వం సోషల్ ఆడిట్ నిర్వహించింది. బుధవారం బి.మఠం ఉపాధి కార్యాలయం సమీపంలో జరిగిన ఈ ఆడిట్ సామాజిక ప్రజావేదిక కార్యక్రమానికి జిల్లా ఉపాధి అధికారి ఆదిశేషారెడ్డి హాజరయ్యారు. అధికంగా సోమిరెడ్డిపల్లె, ముడుమాల, మల్లేపల్లె, పలుగురాళ్లపల్లె గ్రామాల్లో సరిగా పనులు జరగనట్లు ఆడిట్‌లో తేలింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పని దినాలు పెంచాలన్నారు. అలాగే కొన్ని గ్రామ పంచాయతీలలో ఎం బుక్కులలో ఏపీడీ సంతకాలు లేకుండానే బిల్లులు చెల్లించినట్లు తేలడంతో పీడీ వారిపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, ఉపాధి విజిలెన్స్ అధికారి రామలింగారెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయభాస్కర్, మైదుకూరు ఏపీడీ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, ఎస్ఆర్పీ భాస్కర్, ఏపీఓలు డాక్టర్ వసంత్‌కుమార్, హరికృష్ణ పాల్గొన్నారు.

9 ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని గోవిందయ్యమఠం సమీపంలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 9 ఇసుక ట్రాక్టర్లను బుధవారం అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎం.రాజగోపాల్ మాట్లాడుతూ గోవిందయ్యమఠం సమీపంలో రోడ్డు పక్కన 9 ట్రాక్టర్లలో ఇసుకను నింపుకొని అమ్మకానికి ఉంచారని, వాటికి అనుమతులు ఉన్నాయా లేదా, నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే విషయం పరిశీలించేందుకు ట్రాక్టర్లను తహసీల్దారుకు అప్పగించామని తెలిపారు.

సర్వసభ్య సమావేశాల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించాలి

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



కౌన్సిలర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీలో, ఆయా మండలాల్లో నిర్వహించే సర్వసభ్య సమావేశాల్లో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు వ్యూహాత్మకంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. బుధవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం పురపాలక సంఘంలో జరగనున్న సర్వసభ్య సమావేశంలో కౌన్సిలర్లు ఎలా వ్యవహరించాలనే దానిపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సర్వసభ్య సమావేశాల్లో సమస్యలను లేవనెత్తి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పట్టణాభివృద్ధికి ఎంత మేర నిధులు వచ్చాయి, ఏయే పనులు చేపడుతున్నారనే దానిపై స్పష్టత తీసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు అందరూ సమష్టిగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, వైస్ చైర్మన్లు గోపాలస్వామి, సాయిక్రిష్ణ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యద్దారెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఇన్‌చార్జిలు, కో ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

తల్లి పుణ్యలోక ప్రాప్తికోసమే పుష్పగిరికి..

అస్థికలను గంగలో కలిపిన మాజీ ఎమ్మెల్యే రాచమల్లు



పుష్పగిరిలో తన తల్లి అస్థికలను కలిపి నమస్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : తన తల్లి రాచమల్లు మునిరత్నమ్మ పుణ్యలోక ప్రాప్తి కోసమే పుష్పగిరిలోని మూడు నదుల కలయిక వద్దకు వెళ్లినట్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం పుష్పగిరిలోని పెన్నా, కుందూ, పాపాఘ్ని నదుల సంగమం వద్ద తల్లి అస్థికలను కలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాణ శాస్త్రాలు చెప్పిన ప్రకారం పుణ్య నదుల్లో తల్లిదండ్రుల అస్థికలను కలపడం ద్వారా వారు పుణ్యలోకాలకు వెళతారని భావిస్తున్నామని తెలిపారు. ఈ కారణంగానే గత నెల 30న మరణించిన తన తల్లి అస్థికలను శాస్త్రోక్తంగా పూజలు చేసి ఇక్కడ కలిపామని పేర్కొన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సూరేపల్లె ముంపు బాధితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

గోపవరం : మండలంలోని సోమశిల వెనుకజలాల కింద ముంపునకు గురైన సూరేపల్లె దళితవాడ ముంపు బాధితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మాల మహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాలరవి పేర్కొన్నారు. 2008లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి కమ్యూనికేషన్ కటాఫ్ కింద దళితవాడకు ముంపు పరిహారం అందజేశారన్నారు. అప్పట్లోనే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ద్వారా దళితవాడ ముంపు బాధితులకు ఇళ్ల స్థలాలు కేటాయించి పునరావాస కాలనీని ఏర్పాటు చేయాలని జీవో 98ను విడుదల చేశారు. అయితే అప్పటి నుండి ఇప్పటి వరకు వారికి కనీసం ఇంటి స్థలాలు కూడా కేటాయించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా సోమశిల జలాశయంలోకి నీరు వచ్చినప్పుడల్లా దళితవాడలోకి వెనుకజలాలు రావడం, ఏదొక విధంగా తలదాచుకోవడం పరిపాటిగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పునరావాస కాలనీ ఏర్పాటు చేయకపోగా కనీసం ఇళ్ళ స్థలాలు కేటాయిస్తే దళితవాడ వదిలి వెళ్లేందుకు బాధితులు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించకపోతే త్వరలోనే స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ముంపు బాధితులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సాక్షి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్



బి.మఠం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందజేసిన స్టడీ మెటీరియల్



పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం కవిత

బ్రహ్మంగారిమఠం : బి.మఠం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం సాక్షి ఆధ్వర్యంలో గణితం, సైన్స్‌కు చెందిన మెటీరియల్‌ను మైదుకూరు సర్క్యులేషన్ ఇన్‌చార్జి శ్రీనివాసులు పంపిణీ చేశారు. బి.మఠం, మల్లేపల్లె, పలుగురాళ్లపల్లె, పీసీ పల్లె, పెద్దిరాజుపల్లె, రేకలకుం, కస్తూర్బా, గురుకుల పాఠశాలల్లో 369 మంది విద్యార్థులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా అందజేశారు.

కలసపాడు : మండలంలోని ఎగువ రామాపురం, శంఖవరం, పెండ్లిమర్రి వద్ద ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, కలసపాడులోని జెడ్పీ బాలుర, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం సాక్షి ప్రింట్ మీడియా ఆధ్వర్యంలో మ్యాథ్స్, సైన్స్ స్టడీ మెటీరియల్‌ను సాక్షి ఎస్ఆర్ కృష్ణారెడ్డి పంపిణీ చేశారు. మార్చి 23న జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్ ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కవిత, మెర్సీమాలిని, రెడ్డిజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎగువ తంబళ్లపల్లెలో పొలం పిలుస్తోంది



బద్రిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులతో వ్యవసాయాధికారి

కలసపాడు : మండలంలోని ఎగువ తంబళ్లపల్లె గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులందరూ రైతు గుర్తింపు సంఖ్య పొందుటకు రైతుసేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు కె.మునికుమారి, రైతులు పాల్గొన్నారు.

చాపాడు బీసీ కాలనీలో నూతన స్తంభాల ఏర్పాటు



చాపాడు బీసీ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

చాపాడు : చాపాడులోని హైస్కూల్ సమీపంలో గల బీసీ కాలనీలో బుధవారం నూతన స్తంభాలను ఏర్పాటు చేశారు. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇంటి పట్టాలను అందజేశారు. ఈ క్రమంలో గత రెండు ప్రభుత్వాల హయాంలో ఇళ్లను నిర్మించుకున్నారు. అయితే ఈ కాలనీలో కరెంట్ స్తంభాలు ఏర్పాటు కాలేదు. దీంతో బుధవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆదేశాల మేరకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించినట్లు టీడీపీ మైనార్టీ పార్లమెంట్ కార్యదర్శి అక్బర్ సలీం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అక్బర్ వలి, పెద్ద సుబ్బరాయుడు, విద్యుత్ సిబ్బంది సతీష్, రవీంద్ర, చెన్నారెడ్డి, కాంట్రాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలి

చాపాడు : గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి మ్యాగీ పేర్కొన్నారు. మండలంలోని బద్రిపల్లె గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. భూమి కలిగిన ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని, దీని ద్వారా రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇస్తారన్నారు. తద్వారా ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ, ఇతర సేవలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఐటీలో ముగిసిన రోబోటిక్, ఐఓటీ డిప్లమో వర్క్‌షాప్



రోబోటిక్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పర్వేజ్ హుస్సేన్

చాపాడు : స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కాలేజీలో గత మూడు రోజులుగా డిప్లమో విద్యార్థులకు జరుగుతున్న రోబోటిక్, ఐఓటీ వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. హైదరాబాదుకు చెందిన ఐఐక్లబ్ ఫౌండర్ పర్వేజ్ హుస్సేన్ పర్యవేక్షణలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సొంతంగా రోబోస్ తయారు చేయడం, రోబోటిక్ ఆర్మ్ తయారు చేయడం, ల్యాప్‌టాప్‌తో కోడింగ్ రాసి కంట్రోల్ చేయడం, రోబోటిక్ ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీబీఐటీ చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, డైరెక్టర్ అడ్మిన్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ శృతి తదితరులు పాల్గొన్నారు.

పేదల గుడిసెల జోలికి రావొద్దు



అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

బద్వేలు అర్బన్ : భూకబ్జాదారులను, ఆక్రమణదారులను వదిలిపెట్టి నిరుపేదలు వేసుకున్న చిన్నపాటి గుడిసెలను తొలగించాలని చూస్తే అధికారులు తగిన మూల్యం చెల్లించుకుంటారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ పేర్కొన్నారు. ఏళ్ల తరబడి కాపురముంటున్న పేదల కాలనీల్లో మౌళిక వసతులు కల్పించడంతో పాటు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం నెల్లూరు రోడ్డులోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జాకు గురైతే పట్టించుకోని రెవెన్యూ అధికారులు పేదవారు నివాసం ఉండేందుకు రెండు సెంట్లు స్థలంలో గుడిసె వేసుకుంటే ఆగమేఘాల మీద చర్యలకు ఉపక్రమిస్తున్నారని మండిపడ్డారు. రెవెన్యూ అధికారులకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తొలుత కబ్జాకు గురైన విలువైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి మస్తాన్, జిల్లా సమితి సభ్యులు పి.వెంకటరమణ పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సుకు కృషి చేయాలి

కడప అగ్రికల్చర్: రైతుల శ్రేయస్సుకు ప్రతి ఇన్పుట్ సబ్సిడీ డీలర్ కృషి చేయాలి ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఇన్పుట్ సబ్సిడీ డీలర్లకు దేశీ కార్యక్రమంలో భాగంగా శిక్షణ తరగతులు నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్పుట్ సబ్సిడీ డీలర్లు ప్రతి ఒక్కరూ కూడా వ్యవసాయ డిప్లొమా కోర్సులను పూర్తి చేయాలన్నారు. అలాంటి వారు మాత్రమే ఇన్పుట్ సబ్సిడీ డీలర్లుగా మందులు, ఎరువులు అమ్మడానికి కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అనుమతిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్, కృషి విజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్రం సమన్వయకర్తలు డాక్టర్ వీరయ్య, డాక్టర్ అంకయ్య కుమార్‌లు, ఆత్మ పీడీ విజయలక్ష్మి, శాస్త్రవేత్తలు శ్రీవల్లి, సునీల్ కుమార్, భాగమతి ప్రియ, మాధురి పాల్గొన్నారు.

• ప్రత్యేక పూజలు



సుదర్శనస్వామి



ప్రత్యేక అలంకరణలో యోగ నరసింహస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీ సత్యనారాయణ స్వామి ఆలయంలోని సుదర్శనయోగ నరసింహస్వామికి బుధవారం నరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. సుదర్శనయోగ నరసింహస్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ ఆలయంలో ఒకే రాతిపై ఒక వైపు యోగ ముద్రలో నరసింహస్వామి, మరోవైపు సుదర్శన స్వామి ఉండటం విశేషం. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని స్వామివారికి కాయాకర్పూరాలను సమర్పించి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు.

వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ పండితులు, అర్చకులు

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో మహా శివరాత్రి పురస్కరించుకుని బుధవారం నుంచి బ్రహ్మోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈఓ శ్రీనివాసులు, కమిటీ సభ్యులు వీరనారాయణ యాదవ్ పర్యవేక్షణలో ఆలయ పండితులు, అర్చకులు బుధవారం సాయంత్రం మహా గణపతి పూజ, స్వస్తి పుణ్యహవాచనం, పంచాగవ్యారాధన ప్రోక్షణ, యాగశాల ప్రవేశం, మృత్సంగ్రహణం, అంకురార్పణం, అదివాసం, నీరాజనం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



బాలాయపల్లెలో మారెమ్మతల్లికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని రాజుగారివీధిలో వెలసిన శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయ 12వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సాయంత్రం వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, వార్డు కౌన్సిలర్ ఉమ, ఇన్‌చార్జి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

కాశినాయన : మండలంలోని బాలాయపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో మారెమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠ, శిఖర కలశం మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో సాగింది. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పూలతో శోభాయమానంగా అలంకరించారు. ఈ కార్యక్ర మంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పాల్గొని మారెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్‌కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, సర్పంచ్‌లు తిరుమలరెడ్డి, పిచ్చిరెడ్డి, స్థానిక నాయకులు వీరారెడ్డి, రామసుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, చిన్నతిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్టలో మాజీ ఎమ్మెల్యే

బ్రహ్మంగారిమఠం : మండలంలోని పలుగురాళ్లపల్లె పంచాయతీ ఎర్రంపల్లెలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పాల్గొన్నారు. ఆయన రాక సందర్భంగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. సీతారాములకు ప్రత్యేక పూజల అనంతరం ఎస్.రఘురామిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భర్త, ఉపసర్పంచ్ బసిరెడ్డి దుగ్గిరెడ్డి, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన గృహ ప్రవేశంలో మాజీ ఎమ్మెల్యే

దువ్వూరు : మండలంలోని ఐ.బయనపల్లె గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత కందుకూరి మద్దిలేటి రెడ్డి నూతనంగా నిర్మించిన గృహ ప్రవేశ కార్యక్రమానికి బుధవారం మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహారెడ్డి, కాకర్ల శ్రీను యాదవ్, నగరి శ్రీకాంత్, గుర్రాల నాగమునిరెడ్డి, సానేపల్లె కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



సబ్సిడీ రుణాల కోసం అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు



కాశినాయన: నరసాపురంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీఓ మైథిలి, అధికారులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలో చంద్రన్న స్వయం ఉపాధి పథకం ద్వారా బుధవారం సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అన్ని కులాలకు సంబంధించి 142 యూనిట్లు మంజూరు కాగా 3,586 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూలకు జనం భారీగా రావడంతో అధికారులు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం 22 బ్యాంక్‌ల ప్రతినిధులు ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉండగా కొంత మంది మధ్యాహ్నం వరకు హాజరు కాలేదు. ఈ జనాన్ని చూసి కొంత మంది వెనక్కు వెళ్లారు. 3,586 మందిలో 2758 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని మెప్మా టీఈ మహాలక్ష్మి ఈ సందర్భంగా తెలిపారు.

దువ్వూరు : దువ్వూరు మండలానికి మంజూరైన బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రామకృష్ణయ్య ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి 40 యూనిట్లు మంజూరయ్యాయని, వీటి కోసం 425 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. బుధవారం జరిగిన ఇంటర్వ్యూలలో 284 మంది హాజరయ్యారన్నారు. దువ్వూరు, కానగూడూరు ఏపీజీబీ మేనేజర్లు, దువ్వూరు ఎస్‌బీఐ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్వ్యూలు

మైదుకూరు : బీసీ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ కింద రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మైదుకూరు మండలంలో వివిధ కేటగిరిలలో 39 యూనిట్లు మంజూరు కాగా 667 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 382 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, పరిపాలన అధికారి ఎ.నాగేంద్రబాబు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు. మున్సిపాలిటీలో 39 యూనిట్లకు గాను 595 మంది హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు రెడ్డి, మేనేజర్ పరమేశ్వరరెడ్డి, వివిధ బ్యాంకుల అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

39 యూనిట్ల రుణాలకు 311 మంది హాజరు

చాపాడు : చాపాడు మండలానికి 2024–25 ఆర్థిక సంవత్సరానికి మంజూరైన 39 యూనిట్ల రుణాల కోసం బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీ–28, ఈబీసీ–5, కాపు–6 యూనిట్ల చొప్పున మంజూరు కాగా 399 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో బుధవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 311 మంది హాజరయ్యారని ఎంపీడీఓ వీరకిషోర్ తెలిపారు.

సబ్సిడీ రుణాలకు స్పందన

కలసపాడు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ మహబూబ్‌బీ తెలిపారు. బీసీ రుణాలకు మండలంలో 331 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలకు 178 మంది హాజరైనట్లు ఆమె తెలిపారు. మండలానికి బీసీ రుణాలకు 20 యూనిట్లు, కాపు రుణాలకు 5 యూనిట్లు, ఈడబ్ల్యూసీ రుణాలకు ఒక యూనిట్ మంజూరైనట్లు ఆమె పేర్కొన్నారు.

కాశినాయనలో..

కాశినాయన : నరసాపురంలోని స్త్రీశక్తి భవనంలో బుధవారం ఎంపీడీఓ మైథిలి ఆధ్వర్యంలో బీసీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ కులాలకు చెందిన 264 మంది దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీఓ తెలిపారు. ఇటుగుల్లపాడు, పోరుమామిళ్ళ బ్యాంకు పరిధి లోని గ్రామాల వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు.

పోరుమామిళ్ల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం బీసీ కార్పొరేషన్‌లో రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీ, ఈబీసీ అభ్యర్థులు 610 మంది రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోగా 386 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు.

నేడు ఇంటర్వ్యూలు

మండలంలోని గానుగపెంట, ఎస్.వి.రామాపురం, టేకూరుపేట, తిమ్మారెడ్డిపల్లె, చిన్న యరసాల, కవలకుంట్ల పంచాయతీల పరిధిలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు.